ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో మోసం

ఇంటి దొంగలపై అనుమానం

దర్యాప్తు సంస్థలకు నివేదించాలన్న బ్యాంక్ బోర్డు

న్యూఢిల్లీ, మే 21: డెరివేటివ్స్, మైక్రోఫైనాన్స్, బ్యాలన్స్ షీట్ మోసంలో సంస్థకు చెందిన పలువురు ఉద్యోగుల ప్రమేయమే ఉందని ఇండస్‌ఇండ్ బ్యాంక్ బోర్డు అనుమానిస్తున్నది. ఈ క్రమంలోనే మొత్తం వ్యవహారంపై దర్యాప్తు ఏజెన్సీలకు, రెగ్యులేటరీ అథారిటీలకు నివేదించాలని బ్యాంక్‌ను ఆదేశించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) చివరి త్రైమాసిక (జనవరి-మార్చి) ఆర్థిక ఫలితాలను ప్రకటించేందుకు బుధవారం బ్యాంక్ బోర్డు సమావేశమైంది. ఈ క్రమంలోనే బ్యాంక్ అంతర్గత ఆడిటింగ్ నివేదికల సమీక్షతోపాటు ఓ బయటి సంస్థ రిపోర్టు ఆధారంగా ఈ మోసంలో కొందరు ఉద్యోగులు కీలకంగా ఉన్నట్టు అనుమానిస్తున్నామని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఇండస్‌ఇండ్ బోర్డు చెప్పింది. అలాగే ఈ లోపాలకు బాధ్యులైన ఉద్యోగుల జవాబుదారీతనంపైనా దృష్టి సారించామని పేర్కొన్నది. ఈ ఏడాది మార్చిలో డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అకౌంటింగ్ లోపాలను ఈ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ బయటపెట్టిన విషయం తెలిసిందే. దీనివల్ల జరిగిన నష్టం.. గత ఏడాది డిసెంబర్ నాటికి బ్యాంక్ నికర విలువలో దాదాపు 2.35 శాతానికి సమానంగా ఉండొచ్చని కూడా వెల్లడించింది. వెంటనే పీడబ్ల్యూసీతో బ్యాంక్ బ్యాలన్స్ షీట్‌పై దీని ప్రభావాన్ని కూడా అంచనా వేయించారు. ఫలితంగా వివిధ స్థాయిల్లో నెలకొన్న నిర్లక్ష్యం, తక్షణ చర్యలపైనా పీడబ్ల్యూసీ బ్యాంక్‌కు సూచనలు చేసింది. ఇక గత నెల ఏప్రిల్ 29న బ్యాంక్ సీఈవో సుమంత్ కత్పాలియా, డిప్యూటీ సీఈవో అరుణ్ ఖురానాలు రాజీనామా చేసిన సంగతి విదితమే.

రూ.2,329 కోట్ల నష్టం

ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ రూ.2,329 కోట్లు నష్టపోయింది. బ్యాంక్ చరిత్రలోనే ఈ స్థాయి నష్టం ఇదే తొలిసారి కావడం గమనార్హం. మరోవైపు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో సంస్థ షేర్ విలువ 1.39 శాతం నష్టపోయి రూ.771.10గా ఉన్నది.

బంగారం జిగేల్

ఒక్కరోజే రూ.1,910 పెరిగిన ధర • రూ.98,450గా తులం విలువ

న్యూఢిల్లీ, మే 21: బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. నిన్నమొన్నటిదాకా తగ్గుముఖం పట్టిన రేట్లు.. బుధవారం ఒక్కసారిగా ఎగిశాయి. ఈ క్రమంలోనే ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల విలువ రూ.1,910 ఎగబాకి రూ.98,450గా నమోదైంది. ఈ మేరకు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలియజేసింది. కాగా, అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితుల నడుమ మదుపరులు మరోసారి తమ పెట్టుబడులను పసిడి వైపునకు మళ్లించారు. ధరలు ఈ స్థాయిలో పెరిగేందుకు ఇదే కారణమని మార్కెట్ నిపుణులు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు.

హైదరాబాద్‌లో..

హైదరాబాద్‌లోనూ బంగారం ధరలు భారీగా పెరిగాయి. 24 క్యారెట్ తులం రేటు రూ.2,400 పుంజుకొని రూ.97,420 వద్ద స్థిరపడింది. 22 క్యారెట్ 10 గ్రాములు రూ.2,200 అందుకొని రూ.89,300 వద్ద నిలిచింది. మరోవైపు ఢిల్లీలో కిలో వెండి ధర రూ.1,660 పెరిగి రూ.99,160గా ఉన్నది. ఇక పెండ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం, వెండికి డిమాండ్ సహజంగానే ఉన్నదని, దేశ-విదేశీ పరిస్థితులు సైతం రేట్లు పెరిగేలా చేస్తున్నాయని బులియన్ మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కాగా, దేశీయ మార్కెట్‌లో గత నెల ఏప్రిల్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల రేటు మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో రూ.1,01,600 పలికిన విషయం తెలిసిందే. అలాగే అంతకు ముందు నెల మార్చిలో కిలో వెండి ధర ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.1,03,500గా నమోదైన సంగతీ విదితమే.

ఫ్యూచర్ మార్కెట్‌లో..

స్పాట్ మార్కెట్‌తోపాటు ఫ్యూచర్ మార్కెట్‌లోనూ బంగారం జిగేల్‌మంటున్నది. బుధవారం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)పై జూన్ డెలివరీకిగాను గోల్డ్ కాంట్రాక్ట్స్‌లో 10 గ్రాములు రూ.95,665గా ట్రేడ్ అయ్యింది. మునుపటితో పోల్చితే రూ.824 పెరిగింది. ఇక అంతర్జాతీయంగా స్పాట్ గోల్డ్ రేటు ఔన్స్‌కు 3,311.76 డాలర్లు పలికింది. ఫ్యూచర్ గోల్డ్ రేటు ఔన్స్‌కు 3,319.18 డాలర్లుగా ఉన్నది. క్రితం రోజుతో చూస్తే 21 నుంచి 24 డాలర్ల మేరకు పెరుగుదల చోటు చేసుకున్నది.

ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్ బలహీనపడటం బంగారం ధరల పెరుగుదలకు ఊతమిచ్చింది. ద్రవ్యలోటు భయాలతో అమెరికా క్రెడిట్ రేటింగ్‌ను మూడీస్ తగ్గించడం వల్ల సావరిన్ రిస్క్‌ను మదుపరులు పసిగట్టారు.

-చింతన్ మెహెతా, అబ్నస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో

అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఆందోళనలు, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ రేటు మరోసారి 3,300 డాలర్ల స్థాయిని అధిగమించింది.

-సౌమిల్ గాంధీ, హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ అనలిస్ట్

ఇరాన్ న్యూక్లియర్ స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులకు దిగవచ్చన్న అంచనాలు ఉద్రిక్తకర పరిస్థితులను పెంచేశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ అభిప్రాయాలు కూడా మార్కెట్‌ను తీవ్ర ఒడిదొడుకులకు గురి చేస్తున్నాయి.

-కేనట్ చైన్‌వాలా, కొటక్ సెక్యూరిటీస్ ఏవీపీ

దుబాయ్ గోల్డ్‌పై ఆంక్షలు

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి బంగారం, వెండి వంటి విలువైన లోహాల దిగుమతులపై భారత్ ఆంక్షల్ని తీసుకొచ్చింది. ముడి ఖనిజం, పౌడర్ రూపంలో ఉన్నా.. సెమీ-మాన్యుఫాక్చర్డ్‌గా ఉన్నా ఈ ఆంక్షలు వర్తిస్తాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై భారత్-యూఏఈ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) కింద నామినేటెడ్ ఏజెన్సీలు, క్వాలిఫైడ్ జ్యుయెల్లర్స్, వ్యాలిడ్ టారిఫ్ రేట్ కోటా (టీఆర్‌క్యూ) ట్రేడర్స్ ద్వారానే సదరు దిగుమతులు దేశంలోకి జరుగనున్నాయి. కాగా, సీఈపీఏ ఒప్పందం కింద టీఆర్‌క్యూ సిస్టమ్ ద్వారా 1 శాతం టారిఫ్ రాయితీపై యూఏఈ నుంచి ఏటా 200 మెట్రిక్ టన్నులదాకా బంగారాన్ని దిగుమతి చేసుకొనేందుకు భారత్ అంగీకరించింది. అయితే ప్రస్తుత నిబంధనల్లోని లోపాలను అడ్డం పెట్టుకొని కొందరు దిగుమతిదారులు బంగారం, వెండి, ప్లాటినమ్ దిగుమతుల్లో అక్రమాలకు పాల్పడుతుండటంతో త్వరలోనే ఆంక్షల్ని తేనున్నట్టు ఈ ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఈ ఏడాది ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రకటించిన బడ్జెట్‌లోనే కేంద్రం ప్రకటించింది. అందులో భాగంగానే ఇప్పుడు వీటిని తీసుకొచ్చింది. మే 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) తెలిపింది.

పెరిగిన విమాన ప్రయాణికులు

ఏప్రిల్‌లో 1.43 కోట్ల మంది ప్రయాణం: డీజీసీఏ

న్యూఢిల్లీ, మే 21: దేశవ్యాప్తంగా విమానాల్లో ప్రయాణించేవారి సంఖ్య ప్రతి నెల పెరుగుతున్నారు. గత నెలలో దేశీయంగా 1.43 కోట్ల మంది విమానాల్లో ప్రయాణించారు. క్రితం ఏడాది ఇదే నెలలో ప్రయాణించిన వారితో పోలిస్తే 8.45 శాతం చొప్పున పెరిగారని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్(డీజీసీఏ) తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. విమానయాన రంగంలో 64.1 శాతం మార్కెట్ వాటాతో ఇండిగో తొలిస్థానంలో నిలువగా, ఎయిర్ ఇండియా గ్రూపు 27.2 శాతంతో ఆ తర్వాతి స్థానంలో నిలిచింది. అలాగే ఆకాశ ఎయిర్ 5 శాతం, స్పైస్‌జెట్ 2.6 శాతం మార్కెట్ వాటా కలిగివున్నాయని పేర్కొంది. అలాగే ఈ ఏడాది తొలి నాలుగు నెలలు(జనవరి-ఏప్రిల్ మధ్యకాలంలో) 5.73 కోట్ల మంది విమాన ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకున్నారని తెలిపింది. క్రితం ఏడాది ప్రయాణించిన 5.23 కోట్లతో పోలిస్తే 9.87 శాతం అధికం. సరైన సమయానికి విమాన సర్వీసులు నడిపిన సంస్థల్లో 80.8 శాతంతో ఇండిగో తొలి స్థానంలో నిలువగా, ఆకాశ ఎయిర్ 77.5 శాతం, ఎయిర్ ఇండియా 72.4 శాతంతో ఉన్నాయి.

ఇండిగో డివిడెండ్ రూ.10

ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో అంచనాలకుమించి రాణించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.3,067.5 కోట్ల పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.1,894.8 కోట్ల లాభంతో పోలిస్తే 62 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.18,505 కోట్ల నుంచి రూ.23,097.5 కోట్లకు ఎగబాకింది. మరోవైపు, రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.10 డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది. ప్రస్తుతం సంస్థ 400 విమానాలతో ప్రతిరోజు 2,200 దేశీయ, అంతర్జాతీయ రూట్లలో సర్వీసులు నడుపుతున్నది.

టీసీఎస్‌కు భారీ ఆర్డర్

న్యూఢిల్లీ, మే 21: దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) భారీ ఆర్డర్‌ను చేజిక్కించుకున్నది. ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ నుంచి రూ.2,903.22 కోట్ల విలువైన ఆర్డర్ లభించినట్టు పేర్కొంది. ఈ ఆర్డర్‌లో భాగంగా 18,685 సైట్లలో 4జీ మొబైల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడంతోపాటు సరఫరా, ఇన్‌స్టాలేషన్, టెస్టింగ్, కమిషనింగ్, వార్షిక నిర్వహణ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. బీఎస్ఎన్ఎల్ 4జీ ప్రాజెక్ట్‌నకు సంబంధించి అవసరమైన వస్తువులు లేదా సేవలు అందించడానికి టాటా గ్రూపునకు చెందిన మరో సంస్థ టీసీఎస్ తేజాస్ నెట్‌వర్క్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది.

సూచీల వరుస నష్టాలకు బ్రేక్

ముంబై, మే 21: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. వరుసగా మూడు రోజులుగా భారీగా నష్టపోయిన సూచీలు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించడంతోపాటు ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు కూడా తోడవడం సూచీలు తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. ఇంట్రాడేలో 800 పాయింట్లకు పైగా ఎగబాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ ఒక దశలో 82 వేల మార్క్‌ను అధిగమించింది. చివర్లో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడం భారీ లాభాలను నిలుపుకోలేకపోయింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 410.19 పాయింట్లు అందుకొని 81,596.63 వద్ద ముగియగా, మరో సూచీ నిఫ్టీ 129.55 పాయింట్లు ఎగబాకి 24,813.45 వద్ద స్థిరపడింది. సూచీలు తిరిగి లాభాల్లోకి రావడంతో రూ.4 లక్షల కోట్ల మదుపరుల సంపద పెరిగింది.

టాప్ గెయినర్‌గా టాటా స్టీల్

అత్యధికంగా లాభపడిన సంస్థల షేర్లలో టాటా స్టీల్ ముందువరుసలో నిలిచింది. దీంతోపాటు బజాజ్ ఫిన్‌సర్వ్, టెక్ మహీంద్రా, నెస్లె, సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటర్స్, ఎన్‌టీపీసీలు ఒక్క శాతానికి పైగా లాభపడ్డాయి. అలాగే హెచ్‌యూఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, రిలయన్స్, ఎస్బీఐ, యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, టైటాన్ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది. కానీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, కొటక్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఐటీసీ, అల్ట్రాటెక్, మారుతి షేర్లు నష్టపోయాయి.

89 వేల పాయింట్లకు సెన్సెక్స్!

వచ్చే ఏడాది జూన్ నాటికి సెన్సెక్స్ 89 వేల పాయింట్లకు చేరుకునే అవకాశాలున్నాయని అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ మోర్గాన్‌స్టాన్లీ అంచనావేస్తున్నది. ప్రస్తుతం కొనసాగుతున్న 81,600 పాయింట్లతో పోలిస్తే ఎనిమిది శాతం వృద్ధిని కనబరచనున్నదని పేర్కొంది.

సింగిల్ చార్జింగ్‌తో 449 కిలోమీటర్లు

- మార్కెట్లోకి ఎంజీ విండ్సోర్

న్యూఢిల్లీ, మే 21: దేశీయంగా ఈవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్ ఇండియా సరికొత్త మాడల్‌ను తీసుకొచ్చింది. ఎంజీ విండ్సర్ ఎక్స్‌క్లూజివ్ ప్రో రకాన్ని ప్రవేశపెట్టింది. ఈ కారు ధర రూ.17.24 లక్షలుగా నిర్ణయించింది. 52.9 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 449 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కంపెనీకి ఉన్న డీలర్ల వద్ద రూ.11 వేలు ముందస్తుగా చెల్లించి ఈ వాహనాన్ని బుకింగ్ చేసుకోవచ్చునని సూచించింది.

అమెరికా ఇన్‌స్టిట్యూట్‌కు ఇండియన్ పేరు

న్యూయార్క్, మే 21: అమెరికాలోని ఓ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు తొలిసారిగా ఓ ఇండియన్ పేరును పెట్టారు. న్యూయార్క్‌లోని ది సిటీ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్‌కు అనుబంధంగా ఓ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ను ఇటీవల ప్రారంభించారు. ఆ సంస్థకు ఒడిశాకు చెందిన ప్రఖ్యాత విద్యావేత్త డాక్టర్ అచ్యుత సమంత పేరు వచ్చేలా 'అచ్యుత సమంత ఇండియా ఇనీషియేటివ్ సీయూఎన్‌వై క్రెస్ట్ ఇన్‌స్టిట్యూట్'గా నామకరణం చేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో అచ్యుత సహా పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

శాశ్వత అతిథిగా సీజేఐ

మహా సర్కార్ బిడ్డుబాటు..

ముంబై, మే 21 (నమస్తే తెలంగాణ): సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పట్ల మహా ప్రభుత్వం వ్యవహరించిన తీరు విమర్శలకు దారి తీయడంతో.. ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. తన తప్పును గుర్తించి, సీజేఐని రాష్ట్ర శాశ్వత అతిథిగా ప్రకటించింది. ఇక నుంచి సీజేఐ రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా ఏమి చేయాలో, ఎలాంటి ప్రొటోకాల్‌ను అనుసరించాలో పేర్కొంటూ ఒక సర్క్యులర్ జారీ చేసింది. ఇటీవల ఆయన మహారాష్ట్రలో చేసిన తొలి పర్యటనకు ముఖ్య అధికారులు హాజరు కాకపోవడం వివాదాస్పదమైంది.

5న రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ఠ

అయోధ్య: శ్రీరామ జన్మభూమిలోని రామాలయంలో రామ దర్బారులోని విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ వచ్చే నెల 5న జరుగుతుంది. దీనికి సంబంధించిన కార్యక్రమాలు వచ్చే నెల 3 నుంచి ప్రారంభమవుతాయి. గోడలపై రామ కథను వివరించే చిత్రాలు మినహా మిగిలిన నిర్మాణ పనులన్నీ వచ్చే నెల 5తో పూర్తవుతాయి. శ్రీరామ జన్మ భూమి నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా ఓ ఇంటర్వ్యూలో ఈ వివరాలను వెల్లడించారు. రామ దర్బారులోని విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠతోపాటు ఇదే ప్రాంగణంలోని ఏడు దేవాలయాల ప్రారంభోత్సవాలు కూడా వచ్చే నెల 5న జరుగుతాయని తెలిపారు.

అమెరికా రక్షణకు గోల్డెన్ డోమ్!

- అంతరిక్షం నుంచి దాడి చేసినా అడ్డుకొనే వ్యవస్థ
- 174 బిలియన్ డాలర్ల వ్యయంతో నిర్మాణం
- ప్రకటించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, మే 21: అమెరికాపై అంతరిక్షం నుంచి దాడి చేసినా అడ్డుకోగల పటిష్ఠమైన గోల్డెన్ డోమ్ క్షిపణి రక్షణ వ్యవస్థను రూపొందించనున్నామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ప్రకటించారు. మొదటిసారిగా అమెరికా ఆయుధాలను అంతరిక్షంలో మోహరించే 175 బిలియన్ డాలర్ల (సుమారు రూ.14.35 లక్షల కోట్లు) విలువైన రక్షణ వ్యవస్థను తన పదవీ కాలం ముగిసే నాటికి పూర్తిస్థాయిలో కార్యాచరణలో పెట్టనున్నామని తెలిపారు. ఓవల్ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అంతరిక్షం నుంచి క్షిపణులను ప్రయోగించినా అడ్డుకొనే విధంగా ఈ రక్షణ వ్యవస్థను రూపొందించనున్నామని చెప్పారు. ఈ గోల్డెన్ డోమ్ వ్యవస్థ నిర్మాణం పర్యవేక్షణను జనరల్ మైఖేల్ గుయెట్‌లీన్‌కు అప్పగించనున్నామని తెలిపారు. గుయెట్‌లీన్ ప్రస్తుతం అమెరికా అంతరిక్ష కార్యకలాపాలకు వైస్ చైర్మన్‌గా ఉన్నారు.

చైనా, రష్యాకు చెక్ పెట్టేందుకు..

ఈ రక్షణ వ్యవస్థలో ఎన్ని ఉపగ్రహాలను, సెన్సార్లను మోహరించనున్నారన్నది వెల్లడించలేదు. గోల్డెన్ డోమ్ రక్షణ వ్యవస్థ పని చేయడం ప్రారంభించిన తరువాత వచ్చే 20 ఏండ్లలో కేవలం అంతరిక్ష ఆధారిత పరికరాలకే 542 బిలియన్ డాలర్లు ఖర్చు కాగలదని అంచనా వేస్తున్నారు. చైనా, రష్యాలు ఇటీవలి కాలంలో కొత్తగా అత్యంత అధునాతనమైన క్షిపణులను అభివృద్ధి చేశాయని వాటిని ప్రతిఘటించేందుకు తగిన రక్షణ వ్యవస్థ అవసరమని పెంటగాన్ చాలాకాలంగా హెచ్చరిస్తున్నది. చైనా, రష్యాలు అంతరిక్షంలో సైతం ఆయుధాలను మోహరించాయని, వాటి ఉపగ్రహాలు కీలకమైన అమెరికన్ ఉపగ్రహాలను పనిచేయకుండా చేయగల సామర్థ్యం గలవని అమెరికా స్పేస్ ఫోర్స్ అధిపతి జనరల్ చాన్స్ సాల్ట్జ్‌మన్ పేర్కొన్నారు.

దాడులను 4 దశల్లో నిలువరించే వ్యవస్థ

ఉపరితలం నుంచి అంతరిక్షం వరకు ఎక్కడి నుంచైనా జరిగే క్షిపణి దాడులను ముందే కనుగొని నాలుగు దశల్లో నిలువరించే విధంగా గోల్డెన్ డోమ్ వ్యవస్థను రూపొందించనున్నారు. నాలుగు దశలు ఈ విధంగా ఉండనున్నాయి.

1. క్షిపణిని ప్రయోగానికి ముందే కనుగొని ధ్వంసం చేయడం
2. క్షిపణి ప్రయోగం జరిగిన ప్రారంభ దశలోనే అడ్డుకోవడం
3. గగనతలంలో మధ్యమార్గంలో నిలువరించడం
4. లక్ష్యం దిశగా దూసుకొస్తున్న క్షిపణిని చివరి నిమిషాల్లో అడ్డుకోవడం.

వక్ఫ్ ఇస్లాంలో భాగం కాదు

- ప్రభుత్వ భూమిపై ఎవరికీ అధికారం ఉండదు
- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ, మే 21: వక్ఫ్ అంటే కేవలం దాతృత్వం మాత్రమేనని, ఇస్లాంలో వక్ఫ్ ముఖ్యమైన పాత్ర కాదని కేంద్ర ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టుకు తెలియచేసింది. వక్ఫ్ బోర్డులు కేవలం "లౌకిక విధులు" నిర్వహిస్తాయని కేంద్రం స్పష్టం చేసింది. మతపరమైన విధులు నిర్వహించే ఆలయ పాలనకు ముస్లింలకు సబంధించిన వక్ఫ్‌కు పోలిక లేదని కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు విన్నవించారు. "వక్ఫ్ ఓ ఇస్లామిక్ భావన. అయితే అది ఇస్లాంలో ముఖ్యమైన భాగం కాదు. వక్ఫ్ కేవలం ఇస్లాంలో ఓ దానం మాత్రమే. దానం అనేది అన్ని మతాలలో భాగమని గత తీర్పులు చెబుతున్నాయి. అది క్రైస్తవంలో కూడా ఉంటుంది. హిందువులలో కూడా దానం అనే విధానం ఉంది. సిక్కులకు కూడా ఉంది" అని మెహతా వాదించారు. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం రెండవ రోజు వక్ఫ్ చట్టంపై దాఖలైన పిటిషన్లపై విచారణ కొనసాగించింది. మొదటి రోజు పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ ఎం సింఘ్వీ తమ వాదనలు వినిపించగా రెండవరోజున ప్రభుత్వం తరపున తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

అది ప్రాథమిక హక్కు కాదు

వివాదాస్పద వక్ఫ్ బై యూజర్ సూత్రం కింద వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునే అధికారం కేంద్రానికి ఉందని మెహతా వాదించారు. "ప్రభుత్వ భూమిపై ఎవరికీ అధికారం ఉండదు. వక్ఫ్ ఆస్తిగా ప్రకటించిన ప్రభుత్వానికి చెందిన భూమిని కూడా కాపాడే అధికారం ప్రభుత్వానికి ఉందని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఉంది" అని మెహతా తెలిపారు. కొత్త చట్టంలో తొలగించిన వక్ఫ్ బై యూజర్ నిబంధన ప్రకారం ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేనప్పటికీ సుదీర్ఘ కాలం మతపరమైన, దాతృత్వ కార్యక్రమాల కోసం ఉపయోగించే ఆస్తుని వక్ఫ్‌గా పరిగణించాల్సి ఉంటుంది. వక్ఫ్ బై యూజర్ ప్రాథమిక హక్కు కాదని తుషార్ మెహతా స్పష్టం చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం, ఆ తర్వాత వచ్చిన భారత ప్రభుత్వాలు పరిష్కరించలేని సమస్యలను కూడా వక్ఫ్ చట్టం తీసుకువచ్చిన సవరణలు పరిష్కరించాయని ధర్మాసనానికి మెహతా తెలిపారు.

పాక్‌లో సింధూ జలాలపై చిచ్చు

- సింధూ ప్రావిన్స్‌లో ఆందోళనలు
- ఇద్దరు కార్యకర్తలు కాల్చివేత
- హోం మంత్రి నివాసానికి నిప్పు

న్యూఢిల్లీ, మే 21: పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో సింధూ జలాల సరఫరాను నిలిపివేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయంతో సింధు ప్రావిన్స్‌లో నీటికి తీవ్ర కటకట ఏర్పడింది. నీళ్లు లేకపోవడంతో సింధూ ప్రాంతవాసులు ఎదురు తిరిగారు. పాక్ హోం మంత్రి జియావుల్ హసన్ ఇంటిని తగలబెట్టారు. సింధూ నది వ్యవస్థపై వివాదాస్పదమైన, సైన్యం మద్దతుతో చేపడుతున్న కాలువ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సింధు ప్రావిన్స్‌లో జరుగుతున్న ఆందోళనలు ఉధృతమయ్యాయి. సింధు ప్రావిన్స్‌పై వివక్ష చూపుతూ పంజాబ్ ప్రాంత అనుకూల వైఖరిని అనుసరిస్తున్నారని వారు మంత్రి జియావుల్ హసన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. గత నెలలో ఈ ప్రాజెక్టును నిలిపివేసిన తర్వాత నిరసనలు తీవ్రమవుతున్న తరుణంలో మంగళవారం ఇద్దరు కార్యకర్తలను కాల్చి చంపడం ఆందోళనకారుల్లో మరింత ఆగ్రహాన్ని కలిగించింది. తమ నీటి కష్టాలకు పంజాబ్ ఆధిపత్యమే కారణమని సింధ్ నిరసనకారులు ఆరోపించారు. ఆందోళనలో పాల్గొన్న సింధీ నేషనలిస్ట్ పార్టీ జేఎస్ఎంఎంకు చెందిన జహిద్ లగహరి అనే కార్యకర్తతో పాటు మరో వ్యక్తిని మంగళవారం పోలీసులు కాల్చి చంపడంతో ఇక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి ప్రతిగా ఉత్తర సింధూలోని నౌషారా ఫిరోజ్ జిల్లాలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆందోళనకారులు జాతీయ రహదారిని దిగ్బంధించి రెండు ఆయిల్ ట్యాంకర్లను దహనం చేశారు. సింధూ నది నుంచి నీటిని పంజాబ్ ప్రాంతానికి మళ్లించడానికి తవ్వుతున్న కాల్వ వల్ల తమకు భవిష్యత్‌లో తాగు, సాగునీటికి తీవ్ర కొరత ఏర్పడుతుందని ఆందోళనకారులు ఆరోపిస్తున్నారు. సింధులో భద్రతను పెంచేందుకు పాక్ మిలిటరీ దళాలను రంగంలోకి దింపింది. ఆందోళనకారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

పదవుల కోసం డీఎంకే లీడర్ నీచత్వం!

- పార్టీ నాయకుల వద్దకు వెళ్లాలని భార్యపై ఒత్తిడి
- మరో 20 మంది మహిళలపై కూడా వేధింపులు
- తమిళ నాడులో డీఎంకే లీడర్ దైవసేయల్‌పై కేసు

చెన్నై, మే 21: తమిళనాడులో అధికార డీఎంకే యువ నాయకుడు దైవసేయల్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. రాజకీయంగా పదవులు దక్కించుకోవడం కోసం తన భార్యతో పాటు మరో 20 మంది మహిళలపై ఒత్తిడి చేస్తున్నాడనే అభియోగాలతో అరక్కోణం పోలీసులు ఎఫ్ఆర్ఆర్ నమోదుచేశారు. అరక్కోణంకు చెందిన దైవసేయల్ 20 ఏండ్ల కాలేజీ విద్యార్థినిని పెండ్లి చేసుకున్నాడని పోలీసులు చెప్పారు. ఈ పెళ్లి సదరు యువతికి ఇష్టం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో పార్టీలో ఎదిగేందుకు, కీలక పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్న దైవసేయల్ డీఎంకే సీనియర్ నాయకుల వద్దకు వెళ్లాలంటూ తన భార్యపై కొంతకాలంగా ఒత్తిడి చేస్తున్నాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో పాటు మరో 20 మంది యువతులను కూడా ఇలా